సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



సమస్యలతో సతమతం

జీఆర్‌పీయూలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కూటమి నేతలు కన్నెత్తి చూడడం లేదు. - 8లో



రిమ్స్‌లో కొరవడిన నిఘా

రిమ్స్‌లో నిఘా కొరవడుతోంది. తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. - 8లో

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు మీకోసం.ఏపి.జీవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు యూరియా కొరతపై ర్యాలీ


ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: జిల్లాలో యూరియా కొరతపై రైతులకు మద్దతుగా సోమవారం శ్రీకాకుళం డివిజన్ పరిధిలోని నాలుగు నియోజకవర్గాల రైతులతో ర్యాలీ కార్యక్రమం ఉందని, దీన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు శ్రీకాకుళంలోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి జిల్లా పరిషత్ సమావేశ మందిరం వరకూ ర్యాలీ ఉంటుందని తెలిపారు. శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకవర్గాలకు చెందిన రైతు సోదరులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. ఈ మేరకు ఆదివారం రాత్రి కృష్ణదాస్ ఓ ప్రకటన విడుదల చేశారు.

దంచి కొట్టిన వాన


ఇచ్ఛాపురం మండలంలో కురుస్తున్న వర్షం

ఇచ్ఛాపురం రూరల్: సాగునీరు లేక నారుమడులు, నాట్లు ఎండిపోతున్న దశలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి పంట పొలాలు నీటితో నిండిపోయాయి. ఈ వర్షం కొబ్బరి తోటలకు ఎంతగానో మేలు చేసిందని కొబ్బరి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షం వల్ల నాట్లకు చీడ,పీడలు తొలగిపోతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఈదుపురంలో జ్వర పీడితులు


ఈదుపురంలో జ్వరాలతో మంచాలపై బాధితులు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇక్కడ ప్రభుత్వాస్పత్రి ఉన్నప్పటికీ వైద్యాధికారి చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. దీంతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. ఫలితంగా రోగులు ప్రైవేటు వైద్యులు, ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ప్రతి వీధిలో జ్వర పీడితులు కనిపిస్తున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని తపాలాశాఖ సూపరింటెండెంట్ వండాన హరిబాబు అన్నారు. పోస్టల్ డివిజన్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళంలోని ప్రధాన తపాలాశాఖ కార్యాలయం వద్దన ఉన్న మున్సిపల్ మైదానంలో ఆదివారం ఉదయం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఒత్తిడి స్థాయిని తగ్గించడంలో, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంలో క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఆగస్టు 29 నుంచి పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో 'ప్రతిరోజు ఒక గంట మైదానంలో ఆడండి' అనే థీమ్‌తో ఫిట్ ఇండియా కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. మూడు రోజులుగా ఫిట్‌నెస్ ప్రతిజ్ఞ, విద్యార్థులతో చర్చలు వంటి కార్యక్రమాలు చేపట్టి ఈ ఆదివారం ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో సైకిల్ ర్యాలీతో కార్యక్రమాలను ముగించినట్లు తెలిపారు.

● ఓం నమో గణేశాయ


శ్రీకాకుళం కల్చరల్: పుష్పాలతో విజయ గణపతి అలంకరణ


నరసన్నపేట: స్టేట్‌బ్యాంకు వీధిలో నిమజ్జనానికి గణపతులను తీసుకెళ్తున్న బాలలు


శ్రీకాకుళం కంపోస్టు కాలనీలో బాలల ఉత్సాహం


ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచిలో సింహాద్రి అప్పన్న రూపంలో గణనాథుడు

మండపాల్లో పవిత్ర కృతులు.. విగ్రహాల్లో విభిన్న ఆకృతులు.. నిమజ్జనాల్లో నృత్య విన్యాసాలతో చవితి ఉత్సవం ఉత్సాహంగా సాగుతోంది. పలుచోట్ల ఆదివారం రాత్రి అనుపు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. బాలలు గణపతి విగ్రహాలను ఊరేగించి సందడి చేశారు.

వైద్యశాఖకు నకిలీ జబ్బు



- రీజనల్ డైరెక్టర్ సంతకాలతో ఆర్డర్లు ఇచ్చేస్తున్న వైనం
- నకిలీ జాయినింగ్ ఆర్డర్లతో డీఎంహెచ్‌ఓను కలుస్తున్న బాధితులు
- రూ.లక్షల్లో వసూలు చేసిన అదే శాఖకు చెందిన ఉద్యోగులు
- కూటమి ప్రభుత్వంలో వెలుగు చూస్తున్న నకిలీ ఉద్యోగ నియామకాలు

అరసవల్లి:

జిల్లా వైద్యశాఖకు 'నకిలీ' జబ్బు పట్టుకుంది. డబ్బు కూటబెట్టడమే ధ్యేయంగా కొందరు ఉద్యోగులు నకిలీ జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చేస్తున్నారు. ఏకంగా రీజనల్ డైరెక్టర్ సంతకాలతో ఈ ఆర్డర్లు ఇచ్చేస్తుండడం గమనార్హం. మొన్న ధనలక్ష్మి, నిన్న తులసీరత్నం, నేడు రాంబాయి. ఇలా ఎందరో బాధితులు రూ.లక్షల్లో మోసపోయి నకిలీ ఉద్యోగ నియామకాల ఆర్డర్లు చేతపట్టుకుని ఏం చెయ్యాలో తోచక తలలు పట్టుకుంటున్నారు. తమను మోసం చేసిన కాంట్రాక్టు ఉద్యోగిపై కొందరు పోలీసులకు ఫిర్యాదు చేస్తే, ధనలక్ష్మి అనే బాధితురాలు ఏకంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ అక్రమ, నకిలీ వ్యవహారాలపై జిల్లాలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఏ మాత్రం స్పందించకుండా అక్రమార్కులకు, మోసాలకు పాల్పడిన వారికి సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా నకిలీ ఆర్డర్ల బాధితులకు న్యాయం చేయాలని తద్వారా అక్రమాలకు అడ్డుకట్ట పడటంతో పాటు శాఖలో పనిచేస్తూ అక్రమాలే లక్ష్యంగా పనిచేసేవారిపై చర్యలు చేపట్టాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

వైద్య శాఖ కేరాఫ్ 'కూటమి' అక్రమాలు

కూటమి ప్రభుత్వం వచ్చాక కొందరు ఉద్యోగులు 'పెద్దల' అండదండలను చూసుకుని ఉద్యోగ నియామకాల్లో నిబంధనలను పక్కనపెట్టి అక్రమాలకు పాల్పడుతున్నారు. అలాంటి ఉద్యోగులతో ఈ శాఖ కీలక విభాగాలు నిండిపోయాయి. ప్రతి పనికీ ఒక్కో రేటు ఫిక్స్ చేయడంతో పాటు రూ.లక్షల్లో వసూలు చేయించి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటూ కొందరు కాంట్రాక్టు ఉద్యోగులు, రెగ్యులర్ ఉద్యోగులతో కలిసి అక్రమాలకు తెగబడుతున్నారు. ఇదే క్రమంలో సాక్షాత్తు డీఎంహెచ్‌ఓ ఏసీబీకి చిక్కిన సంగతి తెలిసిందే. అలాగే గత ఏడాదిలో వైద్యశాఖ రీజనల్ డైరెక్టర్ సంతకాలతో ఉన్న జాయినింగ్ ఆర్డర్ ఫేక్ అని తెలిసి..తానిచ్చిన రూ.4 లక్షలను తిరిగి ఇవ్వాలని కాంట్రాక్టు ఉద్యోగి జీవీ నరసింహంను నిలదీసినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఎస్.ధనలక్ష్మి అనే బాధితురాలు ఏకంగా ఆత్మహత్యకు పాల్పడి ప్రాణాపాయం నుంచి తేరుకుంది. అయితే తర్వాత ఈమె ఇచ్చిన ఫిర్యాదుతో నకిలీ ఆర్డర్ల వ్యవహారం బయటపడింది. దీనిపై 'సాక్షి'లో వచ్చిన వరుస కథనాలతో రీజనల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి విచారణ చేపట్టారు. అయితే ఇంతవరకు ఎలాంటి చర్యలు మాత్రం తీసుకోకపోవడంపై బాధితులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తర్వాత మళ్లీ తాజాగా మరో రెండు మూడు ఫేక్ ఉద్యోగాలు, ఉన్నతాధికారుల ఫోర్జరీ సంతకాలతో కూడిన నకిలీ ఉద్యోగాల నియామక పత్రాలు బయటపడుతుండడం మళ్లీ వైద్యశాఖను వార్తల్లోకి ఎక్కించాయి.


జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం


డీఎంహెచ్‌ఓ గుర్తించిన ఫేక్ జాయినింగ్ ఆర్డర్

రూ.4.50 లక్షలిచ్చి మోసపోయాను

నా భార్యకు కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానంటే అప్పులు చేసి రూ.4.50 లక్షల వరకు నగదును కాంట్రాక్టు ఉద్యోగిగా నాతో పాటు పనిచేసిన జీవీ నరసింహంకు, ఆయన భార్య విజయలక్ష్మికి ఫోన్‌పే ద్వారా పంపించాను. అయితే నా భార్యతో పాటు చాలా మంది నుంచి ఇలాగే డబ్బులు వసూలు చేసి ఫేక్ జాయినింగ్ ఆర్డర్లు సిద్ధం చేసి చూపించాడు. మోసపోయామని తెలుసుకుని అన్ని ఆధారాలతో సహా పోలీసులను సంప్రదించాను.

– టి.సురేష్‌కుమార్, హనుమాన్ జంక్షన్, శ్రీకాకుళం.

ఉన్నతాధికారులకు నివేదించా...



ఉద్యోగాల పేరిట నకిలీ జాయినింగ్ ఆర్డర్లు ఇవ్వడం నా దృష్టికి వచ్చింది. నేరుగా ఓ బాధితుడు చూపించిన ఆర్డర్‌ను చూసిన వెంటనే రీజనల్ డైరక్టర్ కార్యాలయానికి ఈ వివరాలన్నీ నివేదించాను. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలుంటాయి. గతంలో ఇలాంటి వ్యవహారంలో జరిగిన విచారణపై కూడా దృష్టి పెట్టనున్నాం. నిరుద్యోగులు కూడా కాస్త ఆలోచించి అడుగులు వేయాలని, ఉద్యోగాలంటూ ఆశపడి ప్రలోభాలకు లోనై ఎవ్వరికీ డబ్బులు ఇవ్వవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను.

– డాక్టర్ కె.అనిత, డీఎంహెచ్‌ఓ

ఒక్కో పోస్టుకు రూ.4.50 లక్షలు

రిమ్స్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులతో పాటు వైద్యశాఖ పరిధిలోని పీహెచ్‌సీల్లో ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలు తదితర పోస్టుల భర్తీ పేరిట..కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేసిన జీవీ నరసింహం (సింహం)తో పాటు డీఎంహెచ్‌ఓ కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్ తదితరుల బృందం చాలా మంది నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణలు వచ్చాయి. ఆశతో ఉన్న నిరుద్యోగులను గుర్తించి ఉద్యోగమిప్పిస్తామంటూ ఒక్కో పోస్టుకు రూ.4.50 లక్షల వరకు గరిష్ఠంగా వసూలు చేసినట్లుగా బాధితులు చెబుతున్నారు. ఇదే క్రమంలో శ్రీకాకుళానికి చెందిన ఎస్.ధనలక్ష్మితో పాటు తులసీరత్నం, బగ్గు రాంబాయిలతో పాటు ఎచ్చెర్ల మండలానికి చెందిన మరో ఇద్దరు మహిళలకు, వప్పంగికి చెందిన వివాహితకు కూడా ఫేక్ జాయినింగ్ ఆర్డర్లు జారీ అయ్యాయి. ఇవి పట్టుకుని ఏకంగా వీరు డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి వెళితే నకిలీ అని డీఎంహెచ్‌ఓ తేల్చిచెప్పడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. తాజాగా బగ్గు రాంబాయి కుటుంబీకులతో పాటు స్థానికంగా ఉంటున్న తులసీరత్నం భర్త సురేష్‌కుమార్ కూడా డీఎంహెచ్‌ఓ అనితను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. దీనిపై ఆమె స్పందిస్తూ ఉన్నతాధికారులకు సమాచారాన్ని పంపించినట్లుగా తెలిసింది. జిల్లా వైద్య శాఖలో ఈ ఫేక్ ఆర్డర్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

కొత్తూరు, హిరమండలం ఎస్‌ఐలకు వీఆర్



శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లాలోని కొత్తూరు సర్కిల్ పరిధిలో కొత్తూరు, హిరమండలం ఎస్‌ఐలను జిల్లా పోలీసు కార్యాల యానికి వీఆర్ అటాచ్ చేస్తూ అధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. శాఖాపరమైన చర్యల్లో భాగంగా ఎస్‌ఐలు మహ్మద్ అమీర్ అలీ, మహ్మద్ యాసిన్‌లను వీఆర్ అటాచ్డ్ స్పెషల్ బ్రాంచికి బదిలీ చేశారు. కొత్తూరు ఎస్‌ఐ మహ్మద్ అమీర్ అలీ ఇదే నెలలో మండలంలోని శోభనాపురం గ్రామానికి చెందిన ఓ యువకుడిని స్టేషన్‌కు పిలిపించి విచక్షణారహితంగా కొట్టడంతో యువకుని బంధువులు, కుటుంబ సభ్యులు ఎస్పీ మహేశ్వరరెడ్డికి నేరుగా వెళ్లి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. యువకుడు వెంకటరమణ అదే గ్రామంలో కొండపై భారీ పేలుళ్లతో క్వారీ నడుపుతున్న వారిని ప్రశ్నించడం, అక్కడ వాగ్వాదం జరగడం, ఆపై స్టేషన్‌కు పిలిపించి పోలీసులు కొట్టడం పాఠకులకు విదితమే. హిరమండలం ఎస్‌ఐ మహ్మద్ యాసిన్ మండలంలో ఇటీవల వినాయక చవితి ఉత్సవాల్లో రెండు వర్గాలు కొట్టుకునే కేసులోను, ఇతర పరిపాలన పరమైన అంశాల్లో నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తప్పు చేస్తే చర్యలు తప్పవు..

ఎస్పీ మహేశ్వరరెడ్డి తమ విభాగంలో ఎవరైనా తప్పు చేసినట్లు రుజువైతే శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడడం లేదు. ఇటీవలి కాలంలో గార ఎస్‌ఐ జనార్దనరావు, ఇచ్ఛాపురం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసరావు, జి.సిగడాం ఎస్‌ఐ మధుసూదనరావులను వీఆర్‌కు పంపగా.. రౌడీషీటర్లతో కలాపాలు సాగించారని శ్రీకాకుళం రూరల్ ఎస్‌ఐ రాముపై శాఖాపరంగా విచారణ జరిపారు. జి.సిగ డాం ఎస్‌ఐ మధుసూదనరావు డీఆర్ వలస గ్రామంలో శనీశ్వర ఆలయంలోని నవగ్రహ విగ్రహాలు ధ్వంసం చేసిన కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించార నే కారణంతో వీఆర్‌కు పంపినా తిరిగి అదే కేసును ఛేదించడంతో ఇప్పుడు అదే మండలానికి ఎస్‌ఐగా కొనసాగుతున్నారు. జిల్లాలో మరో ముగ్గురు ఎస్‌ఐలు, ఇద్దరు సీఐల పైన వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారి వద్ద చిట్టా ఉన్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ సాగుతోంది.

'యూపీహెచ్‌సీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి'


యూపీహెచ్‌సీ నూతన కార్యవర్గం

శ్రీకాకుళం అర్బన్: అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని యూపీహెచ్‌సీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.సింహాచలం కోరారు. శ్రీకాకుళంలోని ఎన్‌జీవో కార్యాలయంలో ఆదివారం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ శ్రీకాకుళం జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన యూపీహెచ్‌సీ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.సింహాచలం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో యూపీహెచ్‌సీ ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు మెరుగైన వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో ఉన్న సాంకేతిక సమస్యలు పరిష్కారం చేయకుండా చిరు ఉద్యోగుల జీతాల్లో కోతలు విధిస్తాం అంటూ ఆదేశాలు జారీ చేయడాన్ని ఖండించారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలిగా బి.మాలతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డీఎస్ సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా జి.సూర్య ప్రవీణ్, కోశాధికారిగా పి.ఉపేంద్ర, వర్కింగ్ ఉమెన్స్ వింగ్ అధ్యక్షురాలిగా జి.కల్యాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.లక్ష్మి, జాయింట్ సెక్రెటరీగా బి.శ్రీనివాసరావు తదితరులు ఎంపికయ్యారు.

ఆదిత్యుని సన్నిధిలో పూజలు


సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు


ఆదిత్యాలయంలో అన్న ప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివా రం విశేష పూజలు చేశారు. భాద్రపద మాస ఆదివారం, చవితి నవరాత్రుల సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేయించుకున్నా రు. వర్షం కురవడంతో ఆలయ పరిసరాల్లో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆలయం బయట టెంట్లు వేసినప్పటికీ..వర్షంలో టెంట్లు తడిచిపోవడంతో భక్తులు కూడా అవస్థలు పడ్డారు. ఆలయ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ తగు ఏర్పాట్లు చేసినప్పటికీ సరిపోలేదు. అంతరాలయంలో దాతలతో పాటు పలువురు అధికారులకు ఆదిత్యుని దర్శించుకున్నారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి తదితరులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు. అలాగే మధ్యాహ్నం సుమారు 400 మంది వరకు భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఒకే మాట.. ఒక్కటే విగ్రహం


వినాయక విగ్రహం వద్ద పూజలో పాల్గొన్న రెండు మండలాల ప్రజలు

- తిప్పనపుట్టుగలో ఒక్కటే విగ్రహం
- ఐకమత్యంగా వినాయక చవితి
- 57 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ

ఇచ్ఛాపురం రూరల్:

వీధికో విగ్రహం.. వాడకో మండపం కొలువుదీరుతున్న రోజుల్లో 57 ఏళ్లుగా ఆ ఊరి వారు ఒకే మాటపై నిలబడ్డారు. ఒక్కటే విగ్రహాన్ని పెట్టి ఐకమత్యంగా పూజలు చేస్తున్నారు. ఇచ్ఛాపురం, కవిటి మండలాలకు చెందిన గ్రామం తిప్పనపుట్టుగ. పేరుకే రెండు మండలాల గ్రామస్తులు. గ్రామం ఒక్కటే కావడంతో అందరూ కలిసికట్టుగా కార్యక్రమాలు చేస్తూ తమలో ఐక్యతను చాటుకుంటుంటారు. పన్నెండువందల మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో 57 ఏళ్ల కిందట పెద్దలు నిర్ణయించిన విధంగానే స్థానిక బస్టాండ్ మర్రిచెట్టు కింద వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. నాటి నుంచి నేటి వరకు ఒకే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. కుల మతాలకు అతీతంగా రెండు మండలాలకు చెందిన ప్రజలు కలసి ఈ విగ్రహం వద్దే పూజలు నిర్వహిస్తారు. మండపం వద్ద డీజేలు, నృత్యాలు కాకుండా సామూహిక కుంకుమ పూజలు, భజనలు, మండల స్థాయిలో కబడ్డీ, క్విజ్ పోటీలు, కోలాటాలు, రేలారేలా వంటి జానపద నృత్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు వారం రోజుల పాటు నిర్వహిస్తుంటారు.

ఊరంతా నారికేళ, కదళీ ఫలాలు

ఉద్దానం ప్రాంతం కావడంతో ఈ గ్రామానికి చెందిన రైతులు వినాయక చవితి ఉత్సవానికి బహుమతిగా ప్రతి ఒక్క కొబ్బరి రైతు ఒక్కో కొబ్బరి గెలను, తమ తోటల్లో పండించే అరటి గెలను ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. వీటిని గ్రామ పొడుగునా రెండు వైపులా అలంకరించడం ఇక్కడ ప్రత్యేకత. విగ్రహం నిమజ్జనం అనంతరం కొబ్బరి కాయలు, అరటి గెలతో ఒకే ప్రాంతానికి చేర్చి వీటితో పాటు లడ్డూను వేలం వేస్తారు. ఆ మొత్తాన్ని అన్నదానం, వచ్చే ఏడాది చవితి ఉత్సవాలకు వినియోగిస్తారు.


ఉత్సవంలో గ్రామం పొడవునా ఏర్పాటు చేసిన కొబ్బరి, అరటి గెలలు

ఆనవాయితీ కొనసాగిస్తున్నాం



గ్రామస్తులంతా కలసిమెలసి ఉండాలన్న ఉద్దేశంతో నా చిన్నతనంలో గ్రామ పెద్దలు గ్రామంలో ఒకే వినాయక విగ్రహం ఉండాలని నిర్ణయించారు. అప్పటి నుంచి ఈ ఆనవాయితీని కొనసాగిస్తున్నాం. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నాం.

– తిప్పన దాలయ్యరెడ్డి, గ్రామ పెద్ద, తిప్పనపుట్టుగ

నిరాడంబరంగా వేడుకలు చేస్తాం



గ్రామంలో వినాయక చవితి వేడుకలను నిరాడంబరంగా నిర్వహిస్తాం. మండలాలు రెండైనా.. గ్రామం ఒక్కటే కావడంతో అందరం కలసి మెలసిగా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంటాం. ఒకరిని ఒకరం గౌరవించుకుంటూ ముందుకు సాగుతాం. గ్రామంలో నిర్వహించే పండగలను కూడా అలాగే నిర్వహిస్తుంటాం.

– డాక్టర్ రత్నాల తారకేశ్వరరావు, పూజా కమిటీ సభ్యుడు, తిప్పనపుట్టుగ

క్లుప్తంగా

రాష్ట్ర కార్యక్రమాల సంచాలకుడిగా సునీల్ శర్మ



నియామకపత్రం అందుకుంటున్న సునీల్ శర్మ

శ్రీకాకుళం కల్చరల్: సేవ్ టెంపుల్స్ భారత్ రాష్ట్ర కార్యక్రమాల సంచాలకుడిగా నగరానికి చెందిన తెన్నేటి సునీల్ శర్మను నియమితుల య్యారు. ఈమేరకు విశాఖలో జరిగిన 3వ ప్రపంచ తెలుగు మహాసభల్లో సునీల్ శర్మకు అధ్యక్షుడు కేశినేని శ్రీనివాస్ (గజల్) నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణ, గోరక్షణ, మఠాలు, పీఠాలు, సాధువులు, సంతుల పరిరక్షణకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

ఆపదలో అండగా..



సాయం అందిస్తున్న కళింగ కోమటి సంఘ ప్రతినిధులు

కంచిలి: సోంపేట పట్టణానికి చెందిన పాట్నూరు సాయిరోహిత్ కాలేయం పాడవ్వడంతో శస్త్రచికిత్సకు పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కంచిలి పట్టణ కళింగ కోమటి సంఘం సభ్యులు రూ.1,65,211 సాయాన్ని ఆదివారం అందించారు. అంతకుముందు కూడా కొంత మొత్తాన్ని అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సాయిరోహిత్ తల్లిదండ్రులు, సంఘ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

చెట్టుకొమ్మ విరిగిపడి ట్రాఫిక్‌కు అంతరాయం



రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మ

జలుమూరు: సురవరం పంచాయతీ దొంపాక వద్ద ఆదివారం వేకువజామున ఎల్.కె.రోడ్డుపై మర్రి చెట్టుకొమ్మ విరిగిపడటంతో ఉదయం పది గంటల వరకూ ట్రాఫిక్ నిలిచిపోయింది. గతంలో కూడా ఇదే రోడ్డు మీద ఓ చెట్టు కొమ్మ విరగడంతో అప్పుడు కూడా ట్రాఫిక్ సమస్య తలెత్తింది. తరచూ ఇదే చెట్టు నుంచి కొమ్మలు పడటంతో వాహన చోదుకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డు మీదుగా వందలాది ద్విచక్ర వాహనాలు, పాదచారులు, పొలం పనులకు వెళ్లే రైతులు రాకపోకలు సాగిస్తుంటారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

శ్రీకాకుళం క్రైమ్ : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని.. భూ కబ్జాలు, సెటిల్మెంట్లు, ఇతర ఆర్థిక లావాదేవీలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ హెచ్చరించారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పేకాట, బెట్టింగ్, గంజాయి సేవనం, క్రయ విక్రయాలు, బహిరంగంగా మద్యం సేవించి న్యూసెన్సు చేయడం, వినాయక ఉత్సవాల్లో వర్గ విభేదాలు సృష్టించి అల్లర్లకు పాల్పడటం వంటివి తన దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆనందరావుకు సత్కారం



ఆనందరావు, అరుణకుమారి దంపతులను సన్మానిస్తున్న అతిథులు

టెక్కలి: వసతి గృహం సంక్షేమాధికారిగా సత్తారు ఆనందరావు చేసిన సేవలు ఎనలేనివని వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమాధికారి టి.త్రినాథరావు కొనియాడారు. సంతబొమ్మాళి మండలం నౌపడ వసతి గృహం సంక్షేమాధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన సత్తారు ఆనందరావు, అరుణకుమారి దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఓవైపు వసతి గృహం సంక్షేమానికి కృషి చేస్తూ మరో వైపు అసోషియేషన్ బాధ్యతల్లో కీలకంగా పనిచేస్తూ అందరి మన్ననలను పొందిన వ్యక్తి ఆనందరావు అని కొనియాడారు. అనంతరం ఆనందరావు, అరుణకుమారి దంపతులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహం సంక్షేమాధికారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.గురువులు, వార్డెన్లు డి.రామారావు, గ్రామపెద్దలు కె.విష్ణుమూర్తి, వి.కృష్ణారావు, కెప్టెన్ ఎం.మన్మథరావు, ఎస్.కరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం

- డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీలో సౌకర్యాల కొరత
- కన్నెత్తి చూడని కూటమి నేతలు
- ఏడాదిన్నరగా జరగని పాలక మండలి సమావేశాలు
- విద్యుత్, వసతి సమస్యలతో విద్యార్థుల ఇబ్బందులు
- సమావేశాలకు గైర్హాజరౌతున్న స్థానిక నేతలు



ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ

ఎచ్చెర్ల : ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీని కూటమి పాలకులు గాలికొదిలేశారు. మౌలిక సదుపాయాలు, ఇతర సమస్యలతో సతమతమవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఎవరు ముందుకు వస్తే ఎవరినెత్తిన భారం పడుతుందోనని కూటమి పాలకులు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇక్కడ ప్రతి ఏడాది మహిళా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. దీనికి అనుగుణంగా మహిళా వసతి గృహాలు లేవు. ప్రస్తుతానికి రెండు వసతి గృహాలు అవసరమున్నా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు విద్యుత్, మైదానం వంటి సమస్యలు వేధిస్తున్నాయి.

పాలకమండలి సమావేశాలకు మోక్షమెప్పుడో?

వర్సిటీ పాలకమండలి సమావేశాలను ఆరు నెలలకు ఒకసారి నిర్వహించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కసారి కూడా సమావేశాలను నిర్వహించలేదు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి అనుమతి ఇవ్వాలి. ఇప్పటి వరకూ ఈ సమావేశాలకు ఎటువంటి ఆదేశాలను ఉన్నత విద్యామండలి జారీ చేయకపోవటంతో సమావేశాలు నిర్వహించలేదు. పాలక మండలి సమావేశం జరిగితే వర్సిటీ సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలను చేపట్టేందుకు ఆస్కారముంటుంది.

వేధిస్తున్న విద్యుత్, వసతి సమస్యలు..

వర్సిటీలో ముఖ్యంగా విద్యుత్, వసతి సమస్యలు వేధిస్తున్నాయి. విద్యార్థినులకు రెండు వసతి గృహాలు అవసరం కాగా కనీసం ఒక్కటైనా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వర్సిటీకు ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా లైన్ లేదు. ఎచ్చెర్లలో కరెంట్ పోతే వర్సిటీలో కూడా విద్యుత్ ఉండటం లేదు. దీంతో కంప్యూటర్లు కోర్సు చదివే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించడానికి కూడా వీలులేకుండా పోతోంది. అందుకే స్థానికంగా ఉన్న ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. 11 కె.వి.స్మాల్ సబ్‌స్టేషన్‌ను వర్సిటీలో ఏర్పాటు చేయాల్సి ఉంది. అప్పట్లో ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా ఉన్న కళావెంకటరావు ఇక్కడ సబ్‌స్టేషన్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చినా ఆ తర్వాత మర్చిపోయారు. విద్యార్థులకు సరిపడా మైదానం లేదు. ట్రాక్, పోల్స్ లేవు. ఆటలు ఆడుకునేందుకు వీలుగా మైదానం లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు.

ముఖం చాటేస్తున్న స్థానిక నేతలు..

అంబేడ్కర్ వర్సిటీలో చేపడుతున్న కార్యక్రమాలకు స్థానికుల నాయకులకు ఆహ్వానం పంపిస్తున్నా వారు గైర్హాజరు అవుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ సమావేశాలకు హాజరైతే వర్సిటీ సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తారని, వాటిని పరిష్కరించాల్సి వస్తుందని హాజరుకావడం లేదని సమాచారం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్థానిక నేతలు వర్సిటీ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరై సమస్యలను పరిష్కరించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు.

స్పోర్ట్స్ కోటా అమల్లో.. జాప్యమెందుకో?

- ఇంజినీరింగ్, ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లలో కానరాని కోటా
- శాప్ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం
- ప్రభుత్వం స్పందించాలని క్రీడాసంఘాల విజ్ఞప్తి



వాలీబాల్ సాధనలో విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్పోర్ట్స్ కోటా అమలు రెండు అడుగులు ముందుకు.. నాలుగు అడుగులు వెనుక్కి అన్న చందంగా తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాను పక్కాగా అమలు చేస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కాక వందలాది మంది క్రీడాకారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఇంజినీరింగ్, ట్రిపుల్ ఐటీ క్లాసులు మొదలైపోయాయి. అయినా, స్పోర్ట్స్ కోటా ద్వారా భర్తీ కావాల్సిన సీట్లను సంబంధిత శాఖాధికారులు జాప్యం చేస్తుండటంతో విద్యార్థులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. జిల్లాలో పదుల సంఖ్యలో క్రీడాకారులు.. విద్యార్థులు ఎంసెట్, ట్రిపుల్‌ఐటీ సీట్ల రేసులో ఉన్నారు. వీరంతా ఇప్పటికే వివిధ క్రీడాంశాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించి జిల్లా కీర్తిని చాటిచెప్పారు. పతకాలు సాధించి సత్తాచాటారు. అయితే ఉన్నత చదువుల్లో అమలు కావాల్సిన స్పోర్ట్స్‌కోటాను అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో విద్యాసంవత్సరం కోల్పోయే పరిస్థితులు దాపరించాయి.

డీఎస్సీపైనే ఫోకస్..

స్పోర్ట్స్ కోటా భర్తీ చేపట్టాలని ప్రభుత్వం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్)కు ఆదేశించింది. అయితే శాప్ అధికారులు కేవలం డీఎస్సీ ఉద్యోగాలపై మాత్రమే ప్రస్తుతం ఫోకస్ చేస్తున్నారు. మిగిలిన ఉన్నత, ప్రొఫెషనల్, వృత్తివిద్యా కోర్సుల ప్రవేశాల సందర్భంగా స్పోర్ట్స్‌కోటా ద్వారా విద్యార్థుల భర్తీని విస్మరించారు. దీంతో ఎంసెట్, ట్రిపుల్ ఐటీ వంటి ఉన్నత చదువుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు నష్టపోతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని జిల్లాలోని క్రీడా విద్యార్థులు మొరపెట్టుకుంటున్నారు. విద్యార్థుల భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్పోర్ట్స్ కోటా భర్తీకి వెంటనే చర్యలు చేపట్టాలని ఒలింపిక్ సంఘ నాయకులు, క్రీడాసంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థులకు న్యాయం చేయాలి..

జిల్లాలో ఎంతోమంది ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉన్నారు. వీరంతా రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారు. వీరికి స్పోర్ట్స్ కోటా అమలులో అన్యాయం జరగకుండా ప్రభుత్వం దృష్టి సారించాలి.

-మొజ్జాడ వెంకటరమణ, పీడీ–పీఈటీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి

కోటా అమలు చేయాలి..

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ట్రిపుల్ ఐటీ తదితర కోర్సుల్లో విద్యార్థులకు స్పోర్ట్స్ కోటాను అమలు చేయడంలో జాప్యం జరిగిందనే విషయం మా దృష్టికి కూడా వచ్చింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి క్రీడాకారులకు న్యాయం చేయాలి.

- మెంటాడ సాంబమూర్తి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

సర్కారు బడిలో కంప్యూటర్ ల్యాబ్

- పూర్వ విద్యార్థి ఔదార్యం



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

గార: తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాలలో రూ.1.50 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసి స్ఫూర్తిగా నిలిచారు పూర్వ విద్యార్థి బొంది రమణ. గార మండలం కె.మత్స్యలేశం ప్రభుత్వ మోడల్ ప్రైమరీ స్కూల్‌కు అదే గ్రామానికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి రమణ ఆరు కంప్యూటర్లతో పాటు ఫర్నిచర్‌ను ఏర్పాటు చేయగా ఆదివారం సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ శశిభూషణ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా సర్కారు బడిలో చదివే విద్యార్థుల కోసం ల్యాబ్ ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. దాత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ చైతన్య, సర్పంచ్ బుడ్డా లలిత ఎర్రన్న, సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం టి.సుధీర్‌కుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లక్ష్మీ, మైలిపిల్లి సూర్యనారాయణ, తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి అదృశ్యంపై ఫిర్యాదు



నరసన్నపేట: స్థానిక లక్ష్మన్నపేటకు చెందిన వ్యాపారి వెంకట పార్వతీశం గుప్త అదృశ్యమయ్యారు. ఆగస్టు 26న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని సోదరుడు మన్మథరావు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ పిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా గుప్త అదృశ్యం వెనుక పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గుప్తా బంగారు ఆభరణాలు ఒక చోట నుంచి మరొక చోటకు తరలిస్తుండటం, వ్యాపారులకు ఇస్తుండటం, రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తుండంతో పాటు లక్షల్లో లావాదేవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే మంగళవారం తన కారులో స్థానిక పురుషోత్తంనగర్‌కు చెందిన కారు డ్రైవర్‌తో కలిసి విశాఖ వెళ్లగా.. డ్రైవర్ ఆ రాత్రే ఇంటికి చేరుకున్నారని, గుప్తా మాత్రం రాలేదని సమాచారం. సోదరుడు ఫోన్ చేస్తే వేరే వ్యక్తి లిఫ్ట్ చేసి తనకు బస్సులో ఫోన్ దొరికిందని చెప్పారు. ఆయన చెప్పిన చోటకు వెళ్లి ఫోన్ తీసుకొచ్చారు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కేసు నమోదు చేశామని, విశాఖ పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు.

కవితా పోటీల విజేతలు వీరే

శ్రీకాకుళం కల్చరల్: యువ రచయితల వేదిక ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కవితా పోటీల్లో విజేతల వివరాలను వేదిక అధ్యక్షులు తంగి యర్రమ్మ ఆదివారం ప్రకటించారు. గుణుపు శార్వాణి (పాతపట్నం) ప్రథమ, తలగాపు ధనుంజయ (పలాస) ద్వితీయ, ముట్నూరు బాల సుబ్రహ్మణ్యం (ఎల్ఎన్‌పేట) తృతీయ బహుమతికి ఎంపికయ్యారని తెలిపారు. కూన రంగనాయకులు, కాపురెడ్డి శ్రీనివాస్‌లకు కన్సొలేషన్ బహుమతులు వచ్చాయని చెప్పారు. వీరికి త్వరలోనే బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. డాక్టర్ పిలకా శాంతమ్మ, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ తులాల సవరమ్మలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

సెంచూరియన్ యూనివర్సిటీతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం



లక్నోలో సెంచూరియన్ యూనివర్సిటీ ప్రతినిధులతో ఎంఓయూలు మార్చుకుంటున్న ఉత్తరప్రదేశ్ పోలీసులు

కొరాపుట్/పర్లాకిమిడి: ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వంతో సెంచూరియన్ యూనివర్సిటీ చారిత్రక ఒప్పందం కుదుర్చుకుంది. ఉత్తర ప్రదేశ్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ వర్సిటీల మధ్య ఈ నెల 29న ఎంఓయూ కుదిరింది. లక్నోలో జరిగిన సమావేశంలో ఈ మేరకు ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ద్వారా పరిశోధనాత్మక, న్యాయ సంబంధిత, సాంకేతిక అంశాల్లో రెండు సంస్థలు పరస్పరం సహకారం అందించుకుంటాయి. ఈ మేరకు ఉత్తరప్రదేశ్ డీఐజీ రాజీవ్ కృష్ణతో సెంచూరియన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ముక్తికాంత్ మిశ్రా సమాలోచనలు చేశారు. డీఐజీ మాట్లాడుతూ ఈ రెండు సంస్థల కలయిక పరిశోధన రంగంలో నూతన మార్పులు తీసుకువస్తుందని తెలిపారు. సెంచూరియన్ వర్సిటీ ప్రెసిడెంట్ ముక్తి కాంత్ మిశ్రా మాట్లాడుతూ తాము 2016లోనే గుజరాత్ ఫోరెన్సిక్ విభాగంతో పనిచేశామని, ఇప్పుడు ఈ కొత్త ఒప్పందంతో ఫోరెన్సిక్ సేవలు సమాజానికి ఉపయోగపడతాయన్నారు. ఈ ఒప్పందంపై ఉత్తర్ ప్రదేశ్ ఏడీజీ నవీన్ అరోరా, సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ సుప్రియ పట్నాయిక్ సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ లక్నో లోని స్టేట్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కి చెందిన డాక్టర్ సుధీర్ కుమార్, సెంచూరియన్ యూనివర్సిటీ అంతర్జాతీయ, ప్రభుత్వ సంబంధాల డైరెక్టర్ మోనాలిసా ఘోష్, డాక్టర్ రీనా, సి.జమాతానీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో ఏకాదశ రుద్రపారాయణం



మాట్లాడుతున్న సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు

జలుమూరు: లోక కల్యాణం కోసమే శ్రీముఖలింగంలో ఏకాదశ రుద్రపారాయణం నిర్వహించామని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు అన్నారు. ఆదివారం శ్రీముఖలింగంలో ఏకాదశ రుద్రపారాయణంలో పాల్గొని మాట్లాడారు. మానవాళికి ప్రేమ, సేవా మార్గాలును దశాదిశ నిర్దేశం చేసిన సాయి అందరిలోనూ ఉన్నాడన్నారు. మానవ సేవయే మాధవసేవ అని తలచి సాయి చేసిన సేవలు, లీలలు కొనియాడారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, ప్రతినిధులు కస్తూరి భాస్కర్ ప్రసాద్, తోట అరుణ, రాఘవరావు, విశ్వనాథరెడ్డి, జె.శాంతి, దుర్గాప్రసాద్, శ్రీదేవి, కిషోర్, గౌతమ్‌సాయి ఫణీంద్ర, జిల్లా రైస్ ఇన్‌చార్జ్ పైడిశెట్టి వెంకటరమణ, సర్పంచ్ టి.సతీష్ కుమార్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, గ్రామపెద్దలు బి.వి.రమణ, అర్చకులు నాయుడుగారి రాజశేఖర్, వెంకటాచలం, భక్తులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

గర్భగుడిలో బాబా పాదుకలు

శ్రీముఖలింగంలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఏకాదశ రుద్రపారాయణం వివాదంగా మారింది. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో బాబా పాదుకలు గర్భగుడిలో శివుని మూలవిరాట్టు స్వయం భూలింగం వద్ద పెట్టడంతో పలువురు భక్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్వాంతర్యామి అయిన ఆ దేవదేవుడి లింగం వద్ద పాదుకలు ఎలా పెడతారని అర్చకులతో వాగ్వాదానికి దిగారు. మరికొందరు ఈఓ వాసుదేవరావును ప్రశ్నించారు. దీనిపై ఈఓ స్పందిస్తూ వివరణ కోరగా రుద్రపారాయణం నిర్వహిస్తామని సత్యసాయి భక్తులు అడిగితే అనుమతి ఇచ్చామని, ఇలా పాదుకలు గర్భగుడిలో పెడతారని తెలియదన్నారు. కొందరు బాబాభక్తులు అత్యుత్సాహంతో పాదుకలు లోపల పెట్టడం తప్పేనని చెప్పారు. విషయం తెలిసిన వెంటనే పాదుకలు తొలగించామని తెలిపారు. కాగా, ఈ వివాదంపై ఆలయ అర్చకులు, ఈఓ నిర్లక్ష్య వైఖరిపై గ్రామానికి చెందిన భక్తులు కొందరు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు.

రిమ్స్‌లో కొరవడిన నిఘా!

- 650 పడకలకే సెక్యూరిటీ కాంట్రాక్టర్ ఒప్పందం
- ఆస్పత్రిలో ఉన్న పడకల సంఖ్య 930
- పర్యవేక్షణ లేక తరచూ దొంగతనాలు



రిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది

శ్రీకాకుళం : నగరంలోని రిమ్స్ సర్వజన ఆస్పత్రిలో నిఘా కొరవడుతోంది. నిత్యం ఏదో ఒక వార్డులో రోగులు, రోగుల సహాయకులకు సంబంధించిన సెల్‌ఫోన్లు, డబ్బులు, మోటారు సైకిళ్ల చోరీకి గురికావడం పరిపాటిగా మారింది. దొంగతనాలకు సంబంధించి ఔట్ పోస్ట్ పోలీసులకు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. ఇటీవల కాలంలో కొందరు రోగులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కూడా పాఠకులకు తెలిసిందే. తాజాగా జరిగిన ఓ సంఘటన ప్రమాదవశాత్తు జరిగినట్లు చెబుతున్న అది కూడా ఆత్మహత్య అని రిమ్స్ వర్గాల నుంచే వినిపిస్తోంది. కారణం ఏదైనప్పటికీ నిఘా కొరవడంతోనే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఇదేం లెక్క?

రిమ్స్ సర్వజన ఆసుపత్రి 930 పడకల స్థాయిలో ఉన్నప్పటికీ రాష్ట్రస్థాయిలో జరిగిన సెక్యూరిటీ ఒప్పందం మాత్రం 650కు మాత్రమే జరిగింది. రాష్ట్రస్థాయిలో ఉన్న లెక్కల ప్రకారం ఈ ఒప్పందం జరిగినట్లు కొందరు రిమ్స్ అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో తొలుత 650 పడకలకు సెక్యూరిటీ ఒప్పందం జరిగినా అటు తర్వాత మరో వంద పడకలకు పెంచుతూ కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఈ లెక్కన రాష్ట్రస్థాయిలో 750 పడకలకు లెక్కలు ఉండాలి. ఇందుకు భిన్నంగా 650 పడకలకే లెక్కలు ఉన్నట్లు చెబుతూ ఆ మేరకే ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. 2024 ఎన్నికల సమయంలో రిమ్స్ పడకల స్థాయి 930కి చేరింది. ఈ కారణంగానే అప్పట్లో 930 స్థాయికి సెక్యూరిటీని పెంచలేకపోయారు. అటు తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం 930కి కాకపోయినా గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లు 750 పడకలకు కూడా సెక్యూరిటీ ఒప్పందాన్ని కల్పించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పర్యవేక్షణ గాలికి..

రిమ్స్లో నిఘా సిబ్బంది సక్రమంగా పర్యవేక్షణ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పడకల స్థాయి కంటే సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికీ వారితో సైతం సక్రమంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోలేకపోతున్నారు. నిఘాను పర్యవేక్షించాల్సిన అధికారి తరచూ విధులకు గైర్హాజరవుతుండటంతో ఇటువంటి పరిస్థితి నెలకొంది. పర్యవేక్షణ అధికారి తన జాబ్ జార్టును వదిలి ఇతర రిమ్స్ అధికారుల విధుల్లో తలదూర్చడానికి ప్రాధాన్యత ఇస్తుంటారని రిమ్స్ వైద్యులే బహిరంగంగా చెబుతున్నారు ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి సక్రమంగా నిఘా అమలయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

మహిళ అనుమానాస్పద మృతి



సీపాన రమణమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆమదాలవలస: పురపాలక సంఘం పరిధిలోని 12వ వార్డు చంద్రయ్యపేట వీధిలో ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీపాన రమణమ్మ (42) అనే మహిళ భర్త సింహాచలంతో కలిసి చంద్రయ్యపేటవీధిలో నివాసముంటోంది. సింహాచలం వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు కావడంతో శనివారం ఉదయం విధులకు వెళ్లిపోయారు. ప్రతిరోజూ స్థానికులతో కలిసి ఈవినింగ్ వాక్‌కు వెళ్లే రమణమ్మ శనివారం రాకపోవడంతో ఆమె భర్తకు సమాచారం అందించారు. అతను స్కూల్ నుంచి ఇంట్లోకి వెళ్లి చూడగా మంచం పక్కన గచ్చుపై విగతజీవిగా పడి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్సై సనపల బాలరాజు తెలిపారు. రమణమ్మ బ్రెయిన్ స్ట్రోక్‌తోనే మృతి చెందినట్లు పోస్టుమార్టంలో నిర్ధారించినట్టు విశ్వసనీయ సమాచారం.